క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

వెంకటాపురం (కె) : మండలంలోని విజయపురి కాలనీకి చెందిన డర్రా నవీన్ (20) ఆదివారం రాత్రి తన ఇంట్లో చీరతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబీకులు సోమవారం ఉదయం చూసే సరికి నవీన్ మృతి చెందాడు. నవీన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలోనే మానసిక ఒత్తిడికి గురై ఉరేసుకుని ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెయిలీ వేజ్ వర్కర్ల ముందస్తు అరెస్టు



ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా డెయిలీ వేజ్ వర్కర్లు సమ్మె కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు డెయిలీ వేజ్ వర్కర్లను ముందస్తుగా అరెస్ట్ చేసి సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మంగపేట : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన మండలంలోని బోరు నర్సాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు గట్టికొప్పుల ఉపేందర్ కథనం ప్రకారం.. ఉపేందర్‌కు చెందిన గేదె ఉదయం పశువుల మందతో కలిసి మేతకు వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఉన్న ఎల్టీ లైన్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే గేదె మృతి చెందిందని ఉపేందర్ తెలిపారు. విద్యుత్ అధికారులు బాధ్యత వహించి పరిహారం చెల్లించాలని ఉపేందర్ కోరుతున్నాడు.

ప్రహరీ పునర్నిర్మాణం

టేకుమట్ల: ఫిబ్రవరి నెలలో మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం కోసం ఇటీవల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కొంత భాగం ప్రహరీని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానించి తొలగించారు. దానిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేయగా ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేశ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రహరీ పునర్నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేశ్ మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అనుమతులు లేకుండా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

చిట్యాల: గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నెరేళ్ల ఓదేలు డిమాండ్ చేశారు. మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మాదారపు రవీందర్‌గౌడ్ ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో జారి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని సోమవారం ఓదేలు పరామర్శించి మాట్లాడారు. గీత వృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న రవీందర్‌కు కనీసం ఉండటానికి ఇల్లు కూడా లేదన్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి కుమార్, నాయకులు జేరిపోతుల ఓదేలు, రవి, ఐలయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మహదేవపూర్: మండల కేంద్రానికి చెందిన విలాసాగరపు ప్రశాంత్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అతడు ఆర్థికంగా ఆదుకోవాలని పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధును కోరారు. దీంతో జెడ్పీ చైర్మన్ స్పందించి రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు బాధితుడికి పుట్ట మధు వ్యక్తిగత సహాయకుడు ఎల్‌ఓసీ పత్రం అందించి మనోధైర్యం కల్పించారు.

అన్నదానం

కాటారం: మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు భూపెల్లి రాజు దీక్షాదారులకు సోమవారం అన్నదానం చేశారు. తొలుత ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపెల్లి రాజు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు జక్కు రాకేశ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎలుబాక సుజాత, ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్‌గుప్త, గురుస్వాములు పెండ్యాల రంజిత్‌కుమార్, వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.

దగా పడుతున్న ‘వరి’ రైతులు

- 1001 దొడ్డు రకం కొనక వెతలు..
- పశువులకు, పందులకు ఆహారంగా మారిన వైనం



1001 రకం ధాన్యపు రాశి

ఏటూరునాగారం : వరి పండించిన రైతులు దగా పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, కొన్ని చోట్ల సెంటర్లున్నా.. దొడ్డు రకం వరిని కొనకపోవడంతో దళారులు ఇష్టారీతిన రేటు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 175 కొనుగోలు కేంద్రాలుండగా సుమారు 40 లారీల దొడ్డు రకం ధాన్యం నిల్వలున్నట్లు సమాచారం. మిల్లర్లు దొడ్డు వడ్లు తీసుకోవడం లేదని జీసీసీ, సొసైటీలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. కోసిన పంటను కాపాడుకోలేక ఊళ్లోకి వచ్చిన దళారులకే ఎంతకో ఒకంతకు అమ్ముకుంటున్న దుస్థితి నెలకొంది. దళారులు సైతం తేమ ఎక్కువగా ఉందంటూ ధరలో కోత పెట్టి దగా చేస్తున్నారు. గిట్టుబాటు ధర రాక, కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.

1001 రకం పండించిన రైతుల గోస

సన్న వడ్లు పండించాలంటే ఖర్చుతో కూడిన పని. సాంబ, తదితర రకాలు సాగు చేస్తే తెగుళ్ల సోకి పెట్టుబడులు పెరుగుతాయి. ఇదిలా ఉండగా జిల్లాలో వాతావరణానికి అనుకూలమైన 1001 రకం ధాన్యం ఎక్కువగా సాగు చేయడం పరిపాటి. దొడ్డు వడ్లు పండించిన వారికి అమ్ముకునేందుకు కూపన్లు కూడా ఇవ్వబోమని వ్యవసాయశాఖ చెబుతోంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, విత్తన షాపుల్లో విత్తనాలు అమ్ముతుంటే ఎందుకు కేసులు పెట్టలేదని రైతులు మండిపడుతున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కొనడం లేదని కేంద్రాల్లో చెబుతుండడంతో పండించిన పంట ఎలా అమ్మాలి ? ఎవరు కొంటారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో జీసీసీ, ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ల వద్ద దొడ్డు రకం ధాన్యం కుప్పలు పోసి రైతులు రేయింబవళ్లు పడిగాపులు పడుతున్నారు.

ప్రైవేటు వ్యాపారులకు లాభాల పంట

కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు వడ్లు కొనకపోవడంతో దళారులు పల్లెలకు వెళ్లి కొనుగోలు కేంద్రాల నుంచి వెనక్కి వచ్చిన వడ్లను తక్కువ ధరకే కొంటున్నారు. నేరుగా ఊళ్లలోకే వెళ్లి కాంటాలు పెడుతున్నారు. కాంటాలో, ధరల్లో మోసాలకు పాల్పడి రైతులను నిలువునా దోచుకుంటున్నారు. మంచు కారణంగా ధాన్యం తడుస్తుండడంతో పచ్చి ధాన్యం సాకుతో క్వింటాకు రూ.1500లు మాత్రమే చెల్లిస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు వాడకుండా రాళ్లు, ధాన్యం బస్తాలే తూనిక రాళ్లుగా వాడుతూ క్వింటాకు అదనంగా 5 కిలోల ధాన్యం దండుకుంటున్నారు.

మోసపోతున్న రైతులు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, కేంద్రాల్లో దొడ్డు వడ్లు తీసుకోకపోవడంతో రైతులు మోసపోతున్నారు. దళారులకు తక్కువ ధరకే వడ్లను అమ్ముకోవాల్సి వస్తోంది. అధికారులు దొడ్డు వడ్లు కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

200ల బస్తాలు ఉన్నాయి..



మండల కేంద్ర సమీపంలో ఎక్కెల, మానసపల్లిలోని నా పొలంలో 1001 రకం 200 బస్తాలు పండించా. కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు పోసి ఇప్పటివరకు 20 రోజులు అవుతోంది. కానీ ఎవరూ కొనుగోలు చేయడం లేదు. దీంతో పెట్టుబడులు కూడా రాక నానా అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి ఆదుకోవాలి.

– నాసర్, రైతు, ఏటూరునాగారం

అధికారుల సూచన మేరకే..

గతేడాది దొడ్డు రకం సాగు చేయొద్దని జిల్లా అధికారులు తెలిపారు. ఆ విషయాన్ని రైతులు గమనించాలి. ఇప్పుడు పండించిన దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనేందుకు చేసేందుకు చర్యలు చేపట్టారు.

– వేణుగోపాల్, ఏఓ ఏటూరునాగారం

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎస్ఎస్ తాడ్వాయి : డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సాంబయ్య



ఏటూరునాగారంలో..

- యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ఎస్ఎస్ తాడ్వాయి : ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూటీఎఫ్ ముందుకు సాగుతోందని ఇన్‌చార్జ్ ఎంఈఓ యాప సాంబయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ మండల శాఖ అధ్వర్యంలో డైరీని, క్యాలెండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ఫెడరేషన్ ముందుంటోందని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు సుతారి పాపారావు, ఉపాధ్యక్షుడు అలెం భాస్కర్, నాయకులు వంక నాగేశ్వర్‌రావు, చంద్రారెడ్డి, రవీందర్, లక్ష్మయ్య, రజిత, వెంకటలక్ష్మి, ఎంఆర్‌సీ కోఆర్డినేటర్ నీలం బాబు, సీఆర్‌పీ రవికుమార్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం : స్థానిక జెడ్పీ స్కూల్‌లో యూటీఎఫ్ క్యాలెండర్‌ను, డైరీని ఎంఈఓ అనంతుల సురేందర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, చెంచయ్య, వెంకటస్వామి, కిరణ్, రాజేశ్, రాజన్న, సుమన్ పాల్గొన్నారు.

ఎస్సై తిరుపతికి సన్మానం



వెంకటాపురం (కె) : సీఐగా ఇటీవల పదోన్నతి పొందిన స్థానిక ఎస్సై తిరుపతిని మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం శాలువా కప్పి సన్మానించారు. ఎస్సైగా తిరుపతి సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, ఆలుబాక సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి, వెంకటాపురం సర్పంచ్ చిడెం యామిలి, వీఆర్‌కే పురం సర్పంచ్ పూనెం శ్రీదేవి, బీఆర్ఎస్ నాయకులు బాలసాని అశ్వపతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సంఘ సంస్కర్త ఫాతిమా షేక్



ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

ములుగు : తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్‌ను సామాజిక సంఘ సంస్కర్తగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అభివర్ణించారు. ఫాతిమా షేక్ 192వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తస్లీమా మహ్మద్ హాజరై ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సమాజంలోని అసమానతలపై మహిళలను చైతన్యవంతం చేశారని కొనియాడారు. ఆమె స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు.

‘బహుజనులకు కేటాయించాలి’

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవిని బహుజనులకే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకరి రాజబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు పర్యాయాలు సిద్దిపేట జిల్లాకు చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో మంథని నియోజకవర్గంలోని బహుజనులకే చైర్మన్ పదవి ఇవ్వాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: సాంఘిక శాస్త్రం విభాగంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే వ్యాస రచన పోటీలకు మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమరస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన్ ప్రతిష్టాన్, టీఎస్ఎస్‌టీఎఫ్ (తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల వేదిక) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల7న జిల్లా కేంద్రంలో సాంఘిక శాస్త్ర సబ్జెక్టుపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో పాఠశాలకు చెందిన సాయిచరణ్య ప్రథమ బహుమతి, సాయిశ్రీజ, ఆర్.చాందిని ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. వీరికి నగదు పురస్కారం, మెమోంటో, జ్ఞాపిక అందించడంతో జిల్లా అధికారులు ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటనర్సమ్మ, సత్యనారాయణ, జగన్‌నాయక్, జయభాస్కర్, శివలింగం, శ్రీనివాస్, సవిత, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామకమిటీ ఎన్నిక

మహాముత్తారం : మండలంలోని యత్నారం గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దల కిష్టయ్య, ఉపాధ్యక్షుడిగా మంగూనాయక్, ప్రధాన కార్యదర్శిగా నూనావత్ బోజ్యానాయక్, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా పుల్యాల బానయ్యను నియమించారు. అదేవిధంగా ఎస్టీసెల్ అధ్యక్షుడిగా సురేందర్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పుల్యాల సమ్మయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా ముక్కెర మహేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పుట్టల వెంకటేశ్ పాల్గొన్నారు.

చిన్నకోడెపాకను మండలంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న బొట్ల మనోహర్

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని చిన్నకోడెపాక గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా పాలకులు మండల విభజనను చేపట్టారని తెలిపారు. రేగొండ మండలంలోని అతి పెద్ద గ్రామ పంచాయతీ అయిన చిన్నకోడెపాకను మండలంగా ప్రకటించాలని సూచించారు. గ్రామంలో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. మండల ఏర్పాటు విషయంలో ప్రస్తుతం అభిప్రాయ సేకరణ జరుగుతున్న తరుణంలో అధికారులు, పాలకులు మరోమారు పునరాలోచించాలన్నారు. చిన్నకోడెపాకను మండలంగా ప్రకటించకుంటే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. నాయకులు నవీన్, రంజిత్, అనిల్, నరేశ్, ప్రేమ్‌కుమార్, సాంబమూర్తి పాల్గొన్నారు.

14 నుంచి కబడ్డీ పోటీలు

మల్హర్: అనసూయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16 వరకు కాటారం సబ్ డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ నూకల మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వల్లెకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించే సీఎస్ఆర్ కబడ్డీ కప్పు పోటీలకు మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాలకు సంబంధించిన క్రీడకారులు పాల్గొనాలని కోరారు. ఒక్కో టీం రూ.500 చెల్లించి పాల్గొనాలని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు వివరించారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ 7093090860లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థి సంఘం నాయకుల అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: చలో ప్రగతి ముట్టడికి తరలివెళ్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులను భూపాలపల్లి ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలు, ఫిజికల్ టెస్టులో జరిగిన అక్రమాలు, అవకతవలపై విచారణ చేపట్టాలని, ఫిజికల్ టెస్టుల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులందరికీ మెయిన్స్ పరీక్షకు అవకాశం ఇవ్వాలని కోరుతూ చలో ప్రగతి భవనం కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీకాంత్, అనిల్ కిరణ్, జోసెఫ్, పవన్, తిరుపతి, రాజశేఖర్ ఉన్నారు.

రవీందర్‌కు అవార్డు..

చిట్యాల: మండలంలోని జడల్‌పేట శివారు భీష్మనగర్‌కు చెందిన పుట్టకొక్కుల రవీందర్ ఆదివారం భద్రాచలంలో శ్రీ సీతారామ దేవస్థానం ఆవరణంలో తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డు దశమ వార్షికోత్సవంలో అవార్డు అందుకున్నాడు. స్వరసీరాజనం సినీసంగీత గానలహరి కార్యక్రమంలో ఆయనకు తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డ్ అవార్డును అందజేశారు. ఏఎస్ఎస్ 24 టీవీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషలలో 11 గంటల పాటు సాగిన కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, బెంగుళూరు, తమిళనాడు నుంచి పాల్గొనగా రవీందర్ తన గాత్రాన్ని వినిపించి తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డ్ అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు టీవీ. అశోక్‌కుమార్, అనుమాండ్ల నాగరాజు, పోకల శ్రీనివాస్, వనపర్తి చంద్రశేఖర్ పద్మ గార్ల చేతుల మీదుగా అతనికి ప్రశంస పత్రం, మెమోంటో అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రవీందర్‌ను అభినందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క

- ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే సీతక్క సూచించారు. మండలంలోని అబ్బాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సకాలంలో నాణ్యతతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను సీతక్క పరిశీలించారు. తదనంతరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు లభిస్తున్న వసతులను పరిశీలించారు. గణిత లైబ్రేరీని సందర్శించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి కల్పన కుమార్, నాయకులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, చంద్రమౌళి, ఆనందం, శ్యాం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మంగపేట : మండలంలోని భూసంబంధిత సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కత్తిగూడెం గ్రామంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో రెండు టీములు రోజుకు రెండు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తాయని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతుల భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సేవల గురించి వివరించారు. రైతులు భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులను, రైతుల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పలువురు రైతులు భూసమస్యలపై అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యయుత అస్థిత్వ పోరాటమే కీలకం



సభలో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

వెంకటాపురం (కె) : ఆదివాసీల హక్కుల సాధనలో చైతన్యయుత అస్థిత్వ పోరాటమే కీలకమని ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని ఆలయ మైదానంలో సోమవారం నిర్వహించిన ఆదివాసీ అస్థిత్వ పోరు గర్జన సభలో నర్సింహమూర్తి మాట్లాడారు. ఆదివాసీ హక్కులను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. పాలకుల మోసపూరిత విధానాల వల్ల ఆదివాసీలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ తీవ్ర వెనుకబాటుకు గురౌతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత పాలకుల మీదే ఉందన్నారు. వలసవాద గిరిజనేతరులను ఏజెన్సీ ప్రాంతం నుంచి పంపించాలని, జీఓ నెంబర్ 3ను చట్టం చేయాలని, ఏటూరునాగారం ఐటీడీఏకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాలని, ఆదివాసీల సాగులో ఉన్న భూములను అసైన్ చేయాలని, ఇసుక సొసైటీల్లో గిరిజనేతరుల జోక్యాన్ని నివారించాలని, ఉపసర్పంచ్ పదవులను పీసా చట్టం ప్రకారం ఆదివాసీలకే కేటాయించాలని, వలసవాద గిరిజనేతరుల కబ్జాలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నవనిర్మాణ సేన అధ్యక్షుడు నాగరాజు, ప్రముఖ న్యాయవాదులు పల్లా త్రినాథరావు, శ్రీకాంత్ స్మిత్, ఆదివాసీ నాయకులు ఈసం నారాయణ, ముర్రం వీరభద్రం, కుర్సం రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లోనే ఉంటూ పాలనను మరిచరని విమర్శించారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతీ పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబాల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, దేవన్, పీసీసీ సభ్యులు చల్లూరిమధు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కర్ణాకర్, ఐఎన్‌టియూసీ నాయకులు జోగ బుచ్చయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

భూపాలపల్లి అర్బన్ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ మండల లావణ్య కోరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్ఎం మేళాకు మండల నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన వహించగా ఎంపీపీ లావణ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బుర్ర రమేశ్ హాజరై మాట్లాడారు. ఒకే చోట ప్రదర్శనలతో వివిధరకాల సూత్రాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకునేందుకు మేళా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా ఉండి వారు కూడా ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే విధంగా స్ఫూర్తిని నింపాలని కోరారు. పాఠశాల స్థాయిలో చేపట్టే కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండాలని, నూతనంగా అమలు చేస్తున్న తొలిమెట్టు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మండలంలోని 52 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 47 పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్ విభాగాల నుంచి 87 ఎగ్జిబిట్లు ప్రదర్శించగా మొదటి, ద్వితీయ బహుతులను అందజేశారు. ఈనెల 20వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే జిల్లా టీఎల్ఎం మేళాకు మొదటి 5 ఎగ్జిబిట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంఈఓ దేవ, కాంప్లెక్స్ మోడల్ ఆఫీసర్లు వాణి, రషీద్, ఏఎమ్ఓ లక్ష్మణ్, జిల్లా సైన్స్ అధికారి స్వామి, జడ్జిలుగా వ్యవహరించిన మలహర్రావు, మండల నోడల్ అధికారి రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.